సాక్షి
ఒడిశా

బుధవారం । 23 । ఆగస్టు । 2023





## శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ. 4,08,155 |
| బంగారం | 370 మిల్లీ గ్రాములు |
| వెండి | 43 గ్రాముల 700 మిల్లీ గ్రాములు |

- భువనేశ్వర్/పూరీ



## 'తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనది'

విద్యార్థుల చదువు, అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనదని పలువురు పేర్కొన్నారు. జయపురం అప్పర్ కొలాబ్ ఇరిగేషన్ కాలనీ అరవింద పూర్ణాంగ శిక్షా కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సంయుక్త సమావేశం నిర్వహించారు.

- IIలో



## మిషన్ శక్తి మహిళలకు స్కూటీ రుణాలు

మిషన్ శక్తి మహిళల కోసం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ ఏడాది జూన్ 16వ తేదీన మిషన్ శక్తి స్కూటీ యోజన పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రుణాల మంజూరుకు రాయగడ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

- IIలో

# ముందస్తుకు.. ముహూర్తం..?

- రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలపై ఊహాగానాలు
- సెప్టెంబర్ 20 తర్వాత శాసన సభ రద్దు..?
- డిసెంబర్‌లో ఎన్నికలకు వెళ్లేందుకు సీఎం యోచన



**భువనేశ్వర్:** రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల సంకేతాలు బలపడుతున్నాయి. సభలో ఏకైక బలమైన పార్టీగా కొనసాగుతున్న అధికార బిజూ జనతా దళ్ ఈ మేరకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రేపో మాపో 16వ శాసనసభ రద్దుకు ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం లేకపోలేదు. త్వరలో జరగనున్న వర్షాకాలం సమావేశాలు పురస్కరించుకుని శాసన సభ రద్దుకు సంబంధించి తీర్మానం సభలో ప్రవేశ పెట్టేందుకు యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఈసారి వర్షాకాలం సమావేశాలు సంక్షిప్తంగా ముగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### ముఖ్యమంత్రి నిర్ణయంపై ఉత్కంఠ

శాసన సభ రద్దుకు సంబంధించి గత కొద్ది నెలలుగా రాష్ట్ర రాజకీయ శిబిరాల్లో చర్చ సాగుతోంది. అధికార పక్షం బిజూ జనతా దళ్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పెదవి కదపకుండా అంతరంగికంగా పావులు కదుపుతున్నారు. తాజా ఎన్నికల వ్యూహాత్మక కార్యాచరణకు అద్దంపట్టే రీతిలో మంత్రి మండలి సమావేశాలు, తీర్మానాలు, ప్రజాకర్షక పథకాల ప్రవేశం, అమలు వగైరా కార్యకలాపాలను ఆయన ముమ్మరం చేస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం పాల్గొనాల్సి ఉంది. శాసనసభ, లోక్‌సభకు ఎన్నికలు రాష్ట్రంలో ఒకేసారి జరగాల్సి ఉంది. దీంతో రెండు ఎన్నికల్లో సత్తా చాటేందుకు వేర్వేరుగా వెళ్లాలని అధికార పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సుమారు వారం రోజుల్లో శాసన సభ రద్దుకు సంబంధించి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వైఖరి స్పష్టమయ్యే అవకాశం ఉందని రాజకీయ శిబిరాల్లో ఊహాగానాలు షికారు చేస్తున్నాయి.

### 8 నెలలు ముందస్తుగా

రాష్ట్ర శాసన సభ కాల పరిమితి వచ్చే ఏడాది మే 30వ తేదీతో ముగుస్తుంది. ఈలోగా 5 రాష్ట్రాల్లో జరగనున్న శాసన సభ ఎన్నికలతో రాష్ట్ర శాసన సభకు ఈ ప్రక్రియ చేపట్టించి కొత్త ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాటు చేసేందుకు నవీన్ పట్నాయక్ యోచిస్తున్నట్లు సమాచారం. అంటే దాదాపు 8 నెలలు ముందుగా రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### డిసెంబర్‌లో 5 రాష్ట్రాల ఎన్నికలు

ఈ ఏడాది డిసెంబర్ నెలలో దేశంలోని 5 రాష్ట్రాల్లో శాసన సభ ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు ఒడిశా శాసన సభ ఎన్నికలు జరిపేందుకు అనుకూలంగా రద్దు ప్రక్రియకు నవీన్ పట్నాయక్ వ్యూహం లోపాయికారంగా సిద్ధమై ఉంటుందని తెలుస్తోంది. చిట్టచివరి క్షణంలో కీలకమైన నిర్ణయాలు ప్రకటించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన నిర్ణయంతో విపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేసిన దాఖలాలు కోకొల్లలు. ఈ వ్యూహం ప్రకారం అయితే వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని సభ రద్దు తీర్మానం ప్రవేశపెట్టి, డిసెంబర్ నెలలో 5 రాష్ట్రాల్లో జరగనున్న శాసన సభ ఎన్నికలతో కలిపి రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేయడం తథ్యమని తెలుస్తోంది.

## న్యూస్‌రీల్

### నేడు బొనొకొ లగ్గి

**భువనేశ్వర్:** పూరీ జగన్నాథుని శ్రీముఖ అలంకరణ పురస్కరించుకుని బొనొకొ లగ్గి నిర్వహించడం ఆలయ ఆచారంలో ప్రధానమైనది. శ్రావణ శుక్ల సప్తమి సందర్భంగా ఈనెల 23వ తేదీన శ్రీమందిరం రత్న వేదికపై బొనొకొ లగ్గి నిర్వహించేందుకు సమయం ఖరారు అయింది. ద్వితీయ భోగ మండపం తర్వాత సాయంత్రం 6 గంటల నుంచి ఈ సేవా ప్రక్రియ ప్రారంభిస్తారు. శ్రీముఖ అలంకరణ సుమారు రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ వ్యవధిలో స్వామివారి దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేస్తారు. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులు, యాత్రికులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు శ్రీమందిరం అధికార వర్గాలు తెలిపాయి.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన వ్యక్తులు



**రాయగడ:** జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి జమ్ముగుడ కొత్తవీధి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయాలైనవారిలో బొడొడెం గిలెల్లి గ్రామానికి చెందిన బుటి సికక (53), ధమునిపొంగ గ్రామానికి చెందిన గురుబారు కొరాకొరియా (29), బలరాం పారిడ (32)లు ఉన్నారు. గాయాలైనవారిని వైద్యం నిమిత్తం అంబులెన్స్‌లో కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో బలరాం పారిడ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### టవర్లలో బ్యాటరీలు చోరీ



టవర్‌లో బ్యాటరీలు చోరీకి గురైన దృశ్యం

**జయపురం:** సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితిలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన మొబైల్, టెలిఫోన్ టవర్లలో బ్యాటరీలు చోరీకి గురైనట్లు బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ప్రైవేట్ టవర్ల టెక్నీషియన్ కనుచరణ బెహర లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బొరిగుమ్మ పోలీసు అధికారి జుగళ కిషోర్ షా మంగళవారం తెలియజేశారు. మొత్తం 14 బ్యాటరీలు చోరీకి గురయ్యాయని, వాటిలో పండాసిగుడ గ్రామంలోని టవర్‌లో 3 బ్యాటరీలు, కమర గ్రామంలోని టెలిఫోన్ టవర్‌లో 5 బ్యాటరీలు, కొశాగుడ గ్రామంలోని టెలిఫోన్ టవర్‌లో 6 బ్యాటరీలు దొంగతనానికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ అధికారి డొంబు పొరజ వెల్లడించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలియజేశారు.

### డొంగాశిలి పోలీసు అవుట్ పోస్టు ప్రారంభం



అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎస్పీ శర్మ

**రాయగడ:** జిల్లాలోని కాశీపూర్ సమితి కుచేయిపాదొరొ పంచాయతీలోని డొంగాశిలిలో పోలీసు అవుట్ పోస్టును జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ మంగళవారం ప్రారంభించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతీ ప్రాంతంలో పోలీసు అవుట్ పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలియజేశారు. ప్రజలను కాపాడేందుకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో డొంగాశిలి పాఠశాల విద్యార్థులు, సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ నమస్కారం చేయండి

- తోటి సిబ్బందికి మహిళా అధికారి ఆదేశాలు



జీవికా మిషన్ అధికారి మానసీ టకిరి (సర్కిల్‌లో ఉన్న మహిళ)

**రాయగడ:** ప్రతిరోజూ నాకు నమస్కారం చేయండి.. లేదంటే మీ పనులు నిలిపివేస్తాను అని ఒక మహిళా అధికారి తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో బిసంకటక్ సమితి పరిధిలోని జీవికా మిషన్ కార్యాలయంలో మానసీ టకిరి అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. తనకు ప్రతిరోజూ ఆఫీస్‌కు వచ్చిన వెంటనే సిబ్బంది మొత్తం నమస్కారం చేయడం లేదని, కొంతమంది గుడ్ మార్నింగ్‌తో సరిపెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అలాంటివి కొనసాగవని, అందరు తప్పకుండా నమస్కారం చేయాల్సిందేనని గట్టిగా చెప్పారు. అయితే ప్రతిరోజూ గుడ్ మార్నింగ్ చెబుతున్నాం కదా మేడం అని ఒక వ్యక్తి అంటున్నా ఆమె ససేమిరా అన్నారు. ఈ వీడియోను బిసంకటక్ బీడీవో సదాశివ నాయక్ దృష్టికి విలేకరులు తీసుకెళ్లగా, దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## 26 నుంచి రైల్వే ఆక్రమణల తొలగింపు

- స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్న ఆక్రమణదారులు



రైల్వే స్థలాన్ని ఖాళీ చేసిన దృశ్యం

**రాయగడ:** రైల్వే డివిజన్ ఏర్పాటులో భాగంగా అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రైల్వే స్థలాలను తమ హస్తగతం చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. పట్టణంలో అత్యధిక శాతం నిరుపేదలు రైల్వే స్థలాలను ఆక్రమించుకుని ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం వీరిని అక్కడి నుంచి పంపించి స్థలాలను కైవసం చేసుకునేందుకు ఇప్పటికే రైల్వే అధికారులు సన్నాహాలు చేపట్టారు. దీనిలో భాగంగా కొద్ది నెలల క్రితం కొయిలాపొడ బస్తీని తొలగించిన అధికారులు, మిగతా ప్రాంతాల్లో ఉన్న వాటిని కూడా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. గత నెల 10వ తేదీన స్థానిక అభినందన్ హాల్‌కు సమీపంలోని రైల్వేస్థలంలో ఉన్నవారిని తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. అయితే ఉన్నట్టుండి తమను వెళ్లిపొమ్మంటే ఎలా వెళ్తామని, కొంత సమయం ఇవ్వాలని వేడుకోవడంతో రైల్వే అధికారులు సమయం ఇచ్చారు. ఈనెల 25వ తేదీతో ఇచ్చిన గడువు ముగియనున్న నేపథ్యంలో 26 నుంచి తొలగింపు కార్యక్రమాలకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో ఆక్రమణదారులు గత్యంతరం లేక స్వచ్ఛందంగా తమ ఇళ్లను ఖాళీచేసి వారి సామాన్లు, తదితర వస్తువులను తీసుకెళ్లిపోతున్నారు. ఇదిలా ఉండగా స్థానిక డైలీ మార్కెట్, రాణిగుడ ఫారం, వెనుకవీధి, సంతోషిమాత మందిరం వెనుక ప్రాంతం అలాగే జగన్నాథ మందిరానికి సమీపంలోని భీమోవీధి, మజ్జిగౌరి మందిరానికి వెళ్లే రహదారికి ఒకవైపు గల ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించేందుకు రైల్వేశాఖ నోటీసులు జారీ చేసింది.

## త్వరలో ఉత్కళ సిబ్బందికి క్రెచ్ సౌకర్యం

**భువనేశ్వర్:** స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం తన సిబ్బంది అవసరాల దృష్ట్యా క్రెచ్ సౌకర్యాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఉద్యోగస్తులైన తల్లిదండ్రుల పసిబిడ్డల సంరక్షణ కోసం పనిచేసే ప్రాంతంలో క్రెచ్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. క్రెచ్ కేంద్రం డే కేర్ సెంటరుగా సేవలు అందిస్తుంది. ప్రణాళికబద్ధంగా ఈ సౌకర్యం ఉత్కళ క్యాంపస్‌లో అందుబాటులోకి వస్తే తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా నిలుస్తుంది. ఈ కేంద్రంలో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు పసి బిడ్డలను సంరక్షిస్తారు. క్యాంపస్‌లో ప్రతిపాదిత క్రెచ్‌లో 10 నుంచి 15 మంది పిల్లలకు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. బిడ్డల సంరక్షణకు సుశిక్షితులైన కార్యకర్తలను నియమిస్తారు. పసిబిడ్డల తల్లుల (సిబ్బంది) కోసం నర్సింగ్ కార్నర్‌లు, పిల్లలకు అనుకూలమైన మరుగుదొడ్లు మరియు వయస్సుకు తగిన ఆట స్థలాలను క్రెచ్ ప్రాంగణంలో కల్పిస్తారు.

### వన్‌టైం రిజిస్ట్రేషన్

ఈ సదుపాయాన్ని పొందేందుకు ఉద్యోగులు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రూ.2,000 రుసుంతో రిజిస్ట్రేషను పూర్తి చేసుకున్న సిబ్బంది బిడ్డల సంరక్షణ కోసం నెలవారీ రుసుము రూ.3,500 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాలు మినహా అన్ని పని దినాల్లో నిత్యం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ కేంద్రంలో సిబ్బంది పిల్లలను సురక్షితంగా సంరక్షిస్తారు. వీలైన పరిస్థితుల్లో ఇతర సంస్థలకు చెందిన సిబ్బంది బిడ్డలను ఈ కేంద్రంలో చేర్చుకునేందుకు వెసులుబాటు కల్పిస్తారు.

## నాటుసారా బట్టీలపై దాడులు



బోడొజులి గ్రామంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి



పత్రపూర్ సమీపంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి

**బరంపురం:** బరంపురం పోలీసు జిల్లా పరిధిలో అక్రమంగా నడుస్తున్న రెండు వేర్వేరు నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, 3,600 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశాలతో ఎక్సైజ్ అధికారులు జరడా పోలీసుస్టేషన్ పరిధిలోని ఆదివాసీ గ్రామలైనా బోడొజులి, సాసనొ, బడినాల గ్రామాల శివారులోని మొగలి పొదల్లో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీపై దాడులు చేశారు. అదేవిధంగా కె.నువాగం పోలీసుస్టేషన్ పరిధిలోని పత్రపూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలోనూ అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారాపై సైతం దాడులు నిర్వహించారు. ఈ రెండు బట్టీల్లో సుమారు 3,600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. అదేవిధంగా 524 లీటర్ల సారా మరియు సామగ్రీలు స్వాధీనం చేసుకున్నారు.

## '5టీ బృందం గంజాం రావొద్దు'



ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

**బరంపురం:** దక్షిణ ఒడిశాలో ప్రధానమైన గంజాం జిల్లాలో 5–టీ బృందం పర్యటించవద్దని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కన్ను చరణ్‌పతి కోరారు. ఈ మేరకు బరంపురం ఎస్పీ కార్యాలయం ఎదుట గంజాం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధ్యం వహిస్తున్న గంజాంలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ ఒక ప్రభుత్వ అధికారిగా ఉంటూ, ప్రజల సొమ్ముతో ప్రభుత్వ లాంఛనాలు పొందుతూ ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ముఖ్యమంత్రి పేరున ఒక వినతిపత్రాన్ని బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్‌కి అందజేశారు. ఆందోళనలో రాష్ట్ర బీజేపీ కార్యదర్శి భిభుతి జెన్నా, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుభాషిని మహాపాత్రో, సునీల్ సాహు, రాజేంద్రా సాహు, సరత్ కుమార్ సాహు, మదన్ మోహన్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాదులకు శిక్షణ శిబిరం

**జయపురం:** కొరాపుట్ జిల్లాలో కొత్తగా నమోదైన న్యాయవాదులకు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సంస్థ శిక్షణా శిబిరం ఆదివారం నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు, జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

## దొంగతనం కేసులో యువకుడు అరెస్టు



అరెస్టైన ఖగుపతి హరిజన్



స్వాధీనం చేసుకున్న ఇంజిన్

**జయపురం:** సమితిలోని సొరాగుడ గ్రామంలో ఒక పవర్ టిల్లర్ ఇంజిన్‌ను దొంగిలించిన యువకుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి మంగళవారం తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 11వ తేదీన సొరగుడ గ్రామానికి చెందిన శశిభూషణ్ సొర పవర్ టిల్లర్ ఇంజిన్ దొంగతనానికి గురయ్యింది. సుమారు రూ.27 వేలు విలువ కలిగిన ఇంజిన్ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో, శశిభూషణ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభినట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడిని గుర్తించి, మరియగుడ గ్రామ సమీప నీలగిరి తోటలో ఇంజిన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు. అరెస్టైన వ్యక్తి కుంద్ర సమితి మరియగుడకు చెందిన ఖగుపతి హరిజన్(24)గా నిర్ధారించారు. కేసుని ఎస్‌ఐ నవీన్‌కుమార్ టిప్పు దర్యాప్తు చేసి నిందితుడిని చాకచక్యంగా గుర్తించారని వెల్లడించారు.

## సరిహద్దుల్లో పులి సంచారం



పులి అడుగులు



పులి జాడలను పరిశీలిస్తున్న ఆంధ్రాకు చెందిన అటవీ శాఖ అధికారులు

- అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు

**రాయగడ:** జిల్లాలోని గుణుపూర్ సరిహద్దు ప్రాంతమైన మన్యం జిల్లా భామిని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న వార్త దావానంలా వ్యాపించడంతో గుణుపూర్ అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ నీలమాధవ పాఢి సిబ్బందితో గుణుపూర్‌లోని అటవీ ప్రాంతాన్ని సోమవారం సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, అడవుల్లోకి పశువులను మేతకు విడిచిపెట్టవద్దని హెచ్చరించారు. ఇదిలాఉండగా భామిని ఫారెస్ట్ సిబ్బంది పులి సంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పులి అడుగుల నమూనాలను సేకరించారు. ఒడిశా, ఆంధ్రాలకు చెందిన అటవీ శాఖ అధికారులు ఈ మేరకు దీనిపై స్పందించి, సంయుక్తంగా అడవుల్లో నిఘా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపట్టాల్సిన అవసరం ఉందని డిప్యూటీ రేంజర్ పాఢి పేర్కొన్నారు.

## శరవేగంగా పరిక్రమ ప్రాజెక్టు పనులు

- అక్టోబర్‌కు నిర్మాణ పనులు పూర్తి
- భక్తులకు అత్యాధునిక సదుపాయాలు
- శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి రంజన్‌కుమార్ దాస్



ప్రాజెక్టు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**భువనేశ్వర్:** పూరీ శ్రీమందిర్ పరిక్రమ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) రంజన కుమార్ దాస్ తెలియజేశారు. ఆయన అధ్యక్షతన శ్రీమందిరం కార్యాలయంలో ఒడిశా వంతెన నిర్మాణ కార్పొరేషన్ (ఓబీసీసీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల సమీక్ష ఉన్నత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు పనులు అక్టోబర్ నాటికి పూర్తవుతాయని పేర్కొన్నారు. పరిక్రమ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయితే భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

### వెలుపల సువిశాల ప్రాంగణం

శ్రీమందిరం పరిక్రమ (ప్రాకారం) ప్రాజెక్టు పనులు పూర్తయితే శ్రీమందిరం మేఘనాథ ప్రహరి వెలుపల సువిశాల ప్రాంగణం అందుబాటులోకి వస్తుంది. ఈ పరిధిలో నలువైపులా భక్తులకు పలు సౌకర్యాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఆలయ పరిక్రమ పథకం కింద నిర్మించిన మరుగుదొడ్లు పనులు ప్రారంభించగా, రానున్న రోజుల్లో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు కింద నిర్మించిన మరుగుదొడ్లు యాత్రికులకు అక్కరకు వస్తున్నాయి. త్వరలో మరిన్ని సదుపాయాలు భక్తులకు లభిస్తాయని సీఏఓ రంజన్ కుమార్ దాస్ తెలిపారు. శ్రీమందిర్ కార్యాలయం మరియు ఎమ్మార్ మఠం పరిసరాల్లో 2 జగన్నాథ్ రిసెప్షన్ సెంటర్లు నిర్మిస్తారు. ఆలయ కార్యాలయం అభ్యర్థన భవనంలో 2,000 మంది భక్తులకు మరియు మఠంలోని రిసెప్షన్ హాల్‌లో 1,000 మంది భక్తులకు వసతి కల్పించేందుకు వీలవుతుంది. ర్యాంపు వ్యవస్థ కార్యకలాపాలు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) పర్యవేక్షిస్తుంది. మరో 2, 3 నెలల్లో ర్యాంపు పనులు పూర్తవుతాయి. శ్రీమందిరం జగమోహన మండపం ఇతరేతర ప్రధాన ప్రాంగణాల పునరుద్ధరణ, నిర్వహణ, సంరక్షణ కార్యకలాపాల్ని సకాలంలో పూర్తి చేసేందుకు భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ నిర్ధారిత కాల పరిమితిని అధికారులకు దాఖలు చేసింది.

### గ్రంథాలయ నిర్మాణం

ఎమ్మార్ మఠం వెనుక రఘునందన్ (గ్రంథాలయం) నిర్మాణం టెండర్ల ఆహ్వానం ప్రక్రియ ముగిసింది. మార్కండేశ్వర్ సాహిలో ఆలయ సిబ్బంది క్వార్టర్లు, హరచండి సాహిలో సేవాయత్ హౌసింగ్ స్కీం పనులు కొనసాగుతున్నట్లు సీఏవో వివరించారు. శ్రీమందిరం, గుండిచా మందిరం పరిసరాల్లో సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని వివరించారు. పూరీ పట్టణ పరిసర ప్రాంతాల్లో 5 తీర్థ పుష్కరిణుల పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ దిశలో అక్కడక్కడ తలెత్తిన చిన్న సమస్యలను స్థానిక సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో త్వరితగతిన పూర్తి చేస్తారు. గోపాల తీర్థ మఠం, నారాయణి ఆలయం పునరుద్ధరణ కార్యకలాపాల్ని ఈ సమావేశంలో చర్చించారు. జగన్నాథ ఆలయం పోలీసు జేటీపీ కోసం బ్యారెక్ నిర్మాణం సరికొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇతర సిబ్బంది వాహనాల పార్కింగు కోసం ప్రత్యేక సౌకర్యం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో పూరీ సబ్ కలెక్టర్ భవతరణ్ సాహు, శ్రీమందిరం పాలక మండలి సభ్యులు, ఒడిశా బ్రిడ్జి కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఓబీసీసీ) అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### స్నానానికి దిగి వృద్ధురాలి మృతి

జలుమూరు: మండలంలో శ్రీముఖలింగం గ్రామానికి చెందిన ఎస్.వరహాలు (75) వంశధార నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మంగళవారం మృతి చెందింది. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి గాలించిన ఫలితం లేకపోయింది. కొన్ని గంటల తరువాత నగిరికటకం సమీపంలో నదిలో శవమై తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### వివాహిత ఆత్మహత్య



రాజేశ్వరి మృతదేహం

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నివాసముంటున్న వి.రాజేశ్వరి (24) మంగళవారం పొన్నాడ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కునుకుపేట వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజేశ్వరి చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతిచెందడంతో సోదరుడి సమక్షంలో ఉంటోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. అదే కాలనీలో నివాసముంటున్న శివను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకుంది. కొద్ది నెలలుగా అత్తామామల వేధింపులు ఎక్కువ కావడంతో భర్తతో కలిసి ఆదిత్యనగర్ కాలనీలోనే వేరు కాపురం పెట్టారు. ఈ నేపథ్యంలో భర్త నిత్యం తాగివచ్చి రాజేశ్వరిని కొట్టడం, వేధింపులకు గురి చేసేవాడు. మనస్తాపం చెందిన రాజేశ్వరి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బయటకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. సోదరుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### దూరదర్శన్ బీ గ్రేడ్ ఆర్టిస్టులుగా శ్రీకాంత్ శిష్యులు



సర్టిఫికెట్లతో శ్రీకాంత్ శిష్యులు రామకొండిన్య, బాలచందర్

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన సుప్రసిద్ధ నాట్య గురువు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులు రామకొండిన్య, బాలచందర్‌లు ప్రతిష్ఠాత్మకమైన దూరదర్శన్ బీ గ్రేడ్‌ను కూచిపూడి, భరతనాట్యం విభాగంలో సాధించారు. 2013, 2014 సంవత్సరాలలో దూరదర్శన్ బీ గ్రేడ్‌కు దరఖాస్తు చేయగా దూరదర్శన్ డైరెక్టర్ రవీంద్ర రావ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ పొందారు. వీరిద్దరూ శ్రీకాంత్ వద్ద 23 ఏళ్లుగా నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులు మాత్రమే దూరదర్శన్‌లో గ్రేడ్‌లు సాధించగా వారంతా శివశ్రీనృత్య కళానికేతన్ సంస్థ విద్యార్థులు కావడం గమనార్హం.

### జెడ్పీటీసీ ఔదార్యం




పాముకాటుకు గురైన దుర్గను ఆస్పత్రికి తీసుకెళ్లిన జెడ్పీటీసీ వసంతరెడ్డి

సంతబొమ్మాళి: స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి మానవత్వం చాటడంతో ఓ మహిళకు ప్రాణాపాయం తప్పింది. సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల దుర్గ మంగళవారం పాము కాటుకు గురైంది. వెంటనే నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఆ సమయంలో పరామర్శలకు వెళ్లి తిరిగి వస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డికి విషయం తెలియడంతో వెంటనే స్పందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి కాకరులో వెళ్లారు. డాక్టర్‌తో మాట్లాడి వైద్యం త్వరగా ఇవ్వాలని కోరడంతో బాధితురాలకు ప్రాణాపాయం తప్పింది. సకాలంలో స్పందించిన జెడ్పీటీసీకి దుర్గ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

బూర్జ : మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేటకు చెందిన పిన్నింటి పోలమ్మ (57) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలమ్మ ఈ నెల 18న ఇంట్లో ద్వారం దాటుతుండగా మెట్ల పైనుంచి కిందపడిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలమ్మకు భర్త వెంకటరావు, కుమారుడు జనార్దనరావు ఉన్నారు. వెంకటరావు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుప్తేశ్వర్‌కు పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న అపూర్వ శివలింగం



గుప్తేశ్వర్‌కు వెళ్లే మార్గంలో బాల బోల్‌భం భక్తులు

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌కు సోమవారం భక్తులు పోటెత్తారు. ఆంధ్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది భోల్‌భం కావిడిదారులు వచ్చారు. ఈ సందర్భంగా అపూర్వ శివ లింగానికి పవిత్ర జలాభిషేకాలు నిర్వహించారు. జయపురం నుంచి దాదాపు 150 మంది బాల బోల్‌భం భక్తులు గుప్తేశ్వర్ మార్గంలో అందరినీ ఆకట్టుకున్నారు. అనేక మంది భక్తులు గుప్తేశ్వర్ సమీప శబరి నదిలో స్నానాలాచరించడం కనిపించింది. మార్గంలో ముండిగుడ వద్ద జయపురం యువత తమ బోల్‌భం భక్తుల సేవా కార్యక్రమంలో భాగంగా అన్న ప్రసాదాలు సమకూర్చారు.



భక్తులతో కిక్కిరిసిన గుప్తేశ్వర్



శబరి నదిలో స్నానాలాచరిస్తున్న భక్తులు

## మత్తిలి కాల్పుల ఘటన చరిత్రాత్మకమైనది



మాట్లాడుతున్న జుధిష్టర్ రౌళో

● కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో

జయపురం: దేశ స్వాతంత్య్ర పోరాటంలో కొరాపుట్ జిల్లాకు ఎంతో ప్రాధాన్యముందని, ఆ ఉద్యమంలో మత్తిలిలో జరిగిన కాల్పుల ఘటన చరిత్రాత్మకమైనదని జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో అన్నారు. స్థానిక జయపురం కార్మిక భవనంలో ఆదివాసీ నేత బారాజాని అధ్యక్షతన మత్తిలి కాల్పుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జుధిష్టర్ మాట్లాడుతూ.. 1942లో మహాత్మాగాంధీ ఇచ్చిన భారత్ చడో పిలుపుతో కొరాపుట్ జిల్లాలో స్వాతంత్య్ర పోరాటం ఊపందుకుందన్నారు. ఆనాడు ఆదివాసీ నేతలు గాంధీజీ పిలుపునకు ఆకర్షితులై బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారని వెల్లడించారు. 1942 ఆగస్టు 21వ తేదీన లక్ష్మణ్ నాయిక్ నేతృత్వంలో వందలాది మంది ప్రజలు మత్తిలి పోలీసుస్టేషన్‌పై త్రివర్ణ పతకాన్ని ఎగురవేసేందుకు ప్రయత్నిస్తుండగా, వారిపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో 11 మంది మరణించారని వెల్లడించారు. అది కొరాపుట్ జిల్లాలో స్వాతంత్య్ర ఉద్యమకారులపై మొదటి కాల్పుల సంఘటన అన్నారు. ఆ ఘటనలో ఫారెస్టు గార్డు రామయ్య మరణించగా, రామయ్యను లక్ష్మణ నాయిక్ హత్య చేశారని ఆరోపిస్తూ కేసు బనాయించి అక్రమంగా ఉరి తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. లక్ష్మణ నాయిక్ సామ్రాజ్యవాదులపై పోరాటం జరిపారని, ఆయన లక్ష్యం నేటికీ నెరవేరలేదన్నారు. పాలకులు ఆదివాసీ గ్రామీణ ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదని మండిపడ్డారు. మత్తిలి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమార జాని మత్తిలి సంఘటనపై పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నంద హరిజన్, బైద్యనాథ్ హరిజన్, సత్యవ్రత నందో, గంగాధర మరిక తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



జయపురం: రక్తదానం చేస్తున్న యువకులు

పర్లాకిమిడి: తెలుగు సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి 68వ జన్మదిన వేడుకలను ఒడిశా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నటరాజ్ థియేటర్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి అలిజింగి రాము, జిల్లా కార్యదర్శి శ్యాం, మోనంగి కిరణ్, ధర్మా తదితరులు పాల్గొన్నారు.

**రక్తదాన శిబిరం**

జయపురం: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు స్థానిక బంకమఠం ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 25 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. రక్త దాతలకు ప్రశంసా పత్రాలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎం.నగేష్ తదితరులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.గణేష్ రెడ్డి, కె.రాంబాబు, కార్యదర్శి గోవింద నాయిక్, సహాయ కార్యదర్శి గుప్త పాణిగ్రాహి, ఎస్.బుజ్జి, కోశాధికారి వి.సాంబశివరావు, సహాయ కోశాధికారి డి.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



జయపురం: రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: కేక్ కట్ చేస్తున్న చిరంజీవి అభిమాన సంఘం నాయకులు

## మిషన్ శక్తి మహిళలకు స్కూటీ రుణాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సింగ్ తదితరులు

రాయగడ: మిషన్ శక్తి మహిళల కోసం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ ఏడాది జూన్ 16వ తేదీన మిషన్ శక్తి స్కూటీ యోజన పథకం ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మిషన్ శక్తి స్కూటీ యోజన పథకంలో భాగంగా జిల్లాలోని 5,502 మందికి స్కూటీల కోసం రుణాలను మంజూరు చేసేందుకు లక్ష్యం పెట్టుకోగా, 1,929 మంది దరఖాస్తులు పెట్టుకున్నారని కలెక్టర్ సింగ్ వివరించారు. దీనిలో భాగంగా 887 మందికి రుణాలు అందించేందుకు మొదటి పర్యాయంగా యంత్రాంగం నిర్ణయించిందని తెలియజేశారు. రెండో పర్యాయంలో మిగతా వారి దరఖాస్తులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ బ్యాంకులకు చెందిన మేనేజర్లు, జిల్లా పరిషత్ సీడీవీవో నిహారి రంజన్ కుహారో తదితరులు పాల్గొన్నారు.

## 5టీ కార్యదర్శిపై దాడి సరికాదు

జయపురం: ఒడిశా రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌పై సిరాతో దాడి సరికాదని కొరాపుట్ జిల్లా అమలా సంఘం ఖండించింది. జయపురంలోని కార్మిక భవనంలో జిల్లా అమలా సంఘ అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శశిభూషన్ దాస్ మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వ ఉద్యోగిపై జరిగిన దాడి ఉద్యోగులకు అవమానకరమన్నారు. అనంతరం సంఘ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా అమల సంఘ భవన నిర్మాణం, అమల సంఘ నిధుల విషయంపై సుదీర్ఘంగా మాట్లాడారు. సంఘ పాత అధ్యక్ష, కార్యదర్శులు నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పాత అధ్యక్ష, కార్యదర్శులను వెంటనే కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని పలుమార్లు కోరినా స్పందించడం లేదన్నారు. రాష్ట్ర సంఘం ఆదేశాలు సైతం పాటించకపోవడం తీవ్రమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కొరాపుట్ కలెక్టర్, ఎస్పీలకు లేఖల ద్వారా తెలిపి, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలియజేశారు. అంతేకాకుండా వారిపై కొరాపుట్ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో లక్ష్మీకాంత దాస్, సంజయ కుమార్ పండ, బృందావన పండ, కైలాస సామంతరాయ్, రాజేంద్ర నారాయణ పాఢి, కిరణ బిశ్వాసరాయ్, జయంతి కుమార్ సాహు, లలితా పట్నాయిక్, సుజాత మహాపాత్ర, కాళీ ప్రసాద్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు దాస్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

## జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం బుధవారం బార్ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు క్యాంటీన్ బకాయి వసూలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

● **సుబ్రహ్మణ్యస్వామి నమోస్తుతే..!**



నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి శ్రావణ మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

## ‘తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనది’



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: విద్యార్థుల చదువు, అభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ప్రధానమైనదని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అప్పర్ కొలాబ్ ఇరిగేషన్ కాలనీ అరవింద పూర్ణాంగ శిక్షా కేంద్రంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సంయుక్త సమావేశం నిర్వహించారు.

శిక్షా కేంద్రం పరిచాలన కమిటీ అధ్యక్షుడు నిర్మలాచంద్ర మల్లిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పిల్లల చదువులపై తల్లిదండ్రుల భూమికపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లిక్ మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ పాఠశాలల కన్నా ఇక్కడి పాఠశాలలో విద్యా బోధన బాగుందన్నారు. పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. పరిచాలన కమిటీ కార్యదర్శి చంద్రశేఖర మహాపాత్రో మాట్లాడుతూ.. కేవలం ఉపాధ్యాయుల వలనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించలేరని, తల్లిదండ్రుల బాధ్యత గురుతరమైనదని పేర్కొన్నారు. సమావేశంలో పరిచాలన కమిటీ ఉపాధ్యక్షుడు హరిహర సాహు, పాఠశాల ప్రిన్సిపాల్ సుచిశ్మిత మహంతి, వైస్ ప్రిన్సిపాల్ సంజుక్త కుమారీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ● సైకత చంద్రయాన్



‘చంద్రయాన్- 3 ప్రాజెక్టు విజయవంతం కావాలి.. మువ్వన్నెల భారత పతాకం ప్రపంచంలో రెపరెపలాడాలని ఆశిద్దాం’ అనే సంకేతంతో ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస వద్ద సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

– ఆమదాలవలస రూరల్

## మీ క్యాంపస్‌లో మీరే కాప్స్



క్యాంపస్‌కాప్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాధిక, పోలీసు అధికారులు

● ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : చదువుతున్న ప్రతీ విద్యార్థి సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ ఇతరుల పట్ల గౌరవభావంతో మెలగాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. బాధ్యత గల పౌరుడు యూనిఫామ్ లేని పోలీసేనని, మీ క్యాంపస్‌లో మీరే కాప్స్ అని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన క్యాంపస్ కాప్స్ ఫేజ్–2 అనే నూతన పోలీసింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం, టెక్కలిలో ప్రవేశపెట్టిన క్యాంపస్‌కాప్స్‌లో 213 మంది విద్యార్థులు శిక్షణ పొంది 780 గంటల పాటు పోలీసులతో విధి నిర్వహణలో పాల్గొని సహకారాన్ని అందించారన్నారు. మళ్లీ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా అన్ని సర్కిల్ హెడ్ క్వార్టర్స్‌లో మూడురోజుల పాటు ఇవ్వనున్న శిక్షణా తరగతులలో దిశా యాప్ రిజిస్ట్రేషన్, ట్రాఫిక్ నిబంధనలు, ముఖ్యమైన చట్టాలుపై శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. విద్యార్థి మైండ్‌లో తనతో పాటు అందరూ బాగుండాలని, అంకితభావం, క్రమశిక్షణలే క్యాంపస్‌కాప్స్‌కు మొదటి అర్హతని పేర్కొన్నారు. మీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు సమాచారాన్ని పోలీసులకు తెలిపితే మీ వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జేడీ(ఎస్ఈబీ అదనపు ఎస్పీ) వి.నాగమణికంఠ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగివుండాలన్నారు.

అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణాకాలాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.తిప్పేస్వామి మాట్లాడుతూ శిక్షణ తరగతులు క్షుణ్ణంగా అధ్యయనం చేసుకుంటే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం క్యాంపస్ కాప్స్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు తమ అనుభవాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, సీహెచ్‌జీవీ ప్రసాదరావు, డి.విజయ్ కుమార్, ఒకటో, రెండో పట్టణ సీఐలు లెంక సన్యాసి నాయుడు, పప్పల శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్, రణస్థలం సీఐ ఆదాం, ఆమదాలవలస సీఐ పైడయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జానపద కళలను కాపాడుకుందాం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో జానపద కళాకారుల దినోత్సవం మంగళవారం సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు కలగ గణేష్‌యాదవ్ మాట్లాడుతూ కళా ప్రదర్శనలకు అవకాశాలు కల్పించి కళను బతికించాలని కోరారు.

అనంతరం గొర్లెపార్వతి (ఎరుకులపాట), వి.తవిటయ్య(జానపదం), బంకి కాంతారావు (చెక్కభజన), లండ వన్నూరి, తాళాసు ప్రకాష్, నగిరికటకం కర్రెన్న(తప్పెటగుళ్లు), పి.రామలింగ స్వామి (శివబాగోతం), బి.జ్యోతి(బుర్రకథ)లను సత్కరించారు. పందిరిపాట కళాకారుడు బత్తిలి రామకృష్ణను సన్మానించి రూ.2800 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులు పొట్నూరు వెంకటరావు, నిక్కు హరిసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రదేవ్, కోశాధికారి ఇంజరాపు రమణారావు, కంచరాన అప్పారావు, పైడి సత్యవతి, గజల్ వాసుదేవరావు, రౌళో, కేఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు



జానపద కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### పాడిపశువులపై కుక్కల దాడి


కుక్కల దాడిలో తోక కోల్పోయిన పశువును చూపిస్తున్న రైతు

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం గ్రామంలో పాడిపశువులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మంగళవారం జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన బలగ జయరాం, ముదిలి పైడిరాజు, ఒమ్మి నాగమ్మ, దుప్పాడ సింహాచలానికి చెందిన పాడిపశువులు గాయపడడంతో ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం మేరకు స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ బొరోతు పృథ్వీ పశువులకు చికిత్స అందించారు. కుక్కలను నివారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

### వివాహితుడిపై పోక్సోకేసు నమోదు

చీపురుపల్లి రూరల్: మండలంలోని కరకాం పంచాయతీ పరిధి సంకుపాలెం గ్రామానికి చెందిన వివాహితుడు శనపతి ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు పోక్సోకేసు నమోదు చేశామని ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువతి చీపురుపల్లి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శనపతి ప్రసాద్ ఆ యువతితో పరిచయం పెంచుకుని ఫోన్‌చేస్తూ నువ్వంటే ఇష్టమని, ప్రేమిస్తున్నానని, మాయమాటలు చెప్పి శారీరక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. నీరసంగా ఉన్న కుమార్తెను తల్లిదండ్రులు విజయనగరం ఘోషాఆస్పత్రికి తీసుకువెళ్లగా రక్తం తక్కువగా ఉందని, గర్భం దాల్చినట్లు వైద్యసిబ్బంది తెలపడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువకుడి ఆత్మహత్య

• భీమిలి బీచ్‌లో మృతదేహం లభ్యం ..

విజయనగరం క్రైమ్: ఇంట్లోంచి వెళ్లిపోయిన వ్యక్తి భీమిలి సముద్రంలో ఆత్మహత్య చేసుకున్నట్లు విజయనగరం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బ్యాంక్ కాలనీకి చెందిన దేవర కొండ మహావీర్ (30) ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం పని మానేసి ఇంటికి వచ్చేయడంతో కుటుంబసభ్యులతో వాగ్వాదం జరిగింది. అనంతరం మహావీర్ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రాత్రి 8 గంటల తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం భీమిలి బీచ్‌లో మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అవమానంతో గిరిజనుడు..

సీతంపేట: చిల్లంగి నెపంతో అనుమానించి దాడి చేసిన సంఘటనలో అవమానం భరించలేక బెత్తపురం గ్రామానికి చెందిన గిరిజనుడు సవర కిబ్బాయి(44) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటనపై పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో కొంతమందికి చిల్లంగి పెడుతున్నాడని అనుమానించి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కిబ్బాయిని సోమవారం గ్రామంలో స్తంభానికి కట్టేసి కొట్టారు.ఈ అవమానం భరించలేక ఇంటికి వెళ్లిన తరువాత కిబ్బాయి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని భార్య లక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలకంఠ రావు తెలిపారు. మృతుడికి భార్య,ముగ్గురు పిల్లలున్నారు.

### 11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని కూరాకుల వీధి, బృందావనం అపార్ట్‌మెంట్ సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ. 8వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ మంగళవారం తెలిపారు.

### 24న ఐటీఐలో జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ఐటీఐలో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలివ్ టీవీఎస్ అండ్ మహీంద్ర కంపెనీల ఆధ్వర్యంలో జరగనున్న ఈ జాబ్ మేళాకు మెకానిక్ డీజిల్ ట్రేడ్ పూర్తయిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

**ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఆహ్వానం**

స్థానిక ఐటిఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వరకు గడువు ఉందన్నారు. దరఖాస్తు దారులకు 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8309438446, 8328584366 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# సీతాఫలం.. ఆరోగ్య బలం

• పెరగనున్న రోగ నిరోధక శక్తి
• ప్రయోజనాలు అనేకం


ఏజెన్సీలో లభ్యమవుతున్న సీతాఫలం


పండ్లను విక్రయిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. తియ్యని ఈ పండ్లలో ఎన్నో పోషక విలువలుండడమే కాకుండా కొన్ని రకాల అనారోగ్యాల నివారిణిగా పనిచేస్తుంది. ఈ పండే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి తెలిపారు. సీతాఫలం తీసుకుంటే కలిగే ఉపయోగాల గురించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

**ఎన్నో విటమిన్ల కలబోత**

సీతాఫలంలో ఎన్నో రకాల పోషకాలతో పాటు విటమిన్లు ఉన్నాయి. ఈ పండు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ (ఎ), విటమిన్ (బి) మెగ్నిషియం, పొటాషియం, ఫైబర్, ఐరన్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే తినడం ద్వారా కండరాలు, నరాల బలహీనత వంటి రుగ్మతలు తొలగిపోతాయి. శరీరానికి కావాల్సినంత శక్తి లభిస్తుంది. విటమిన్ (ఎ) పుష్కలంగా ఉండడంతో కంటి సమస్యలు దూరమవుతాయి. మెగ్నీషియం, పోటాషియం, సోడియం సమపాళ్లలో ఉండడం వల్ల రక్తపోటును అదుపు చేసి గుండె సమస్యలు తలెత్తకుండా చూస్తుంది. పేరుకుపోయిన అధిక కొవ్వును కరిగిస్తుంది. అల్సర్, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. గర్భిణులు తినడం ద్వారా పుట్టబోయే బిడ్డల మెదడు చురుగ్గా ఉంటుంది.

క్యాన్సర్ వంటి రోగాలు రాకుండా తోడ్పడుతుంది. బలహీనంగా ఉండే చిన్న పిల్లలకు సీతాఫలాలను ఎంత ఎక్కువగా తినిపిస్తే అంత మేలు. ఈ పండ్లను ఎక్కువగా తినడం ద్వారా రక్తహీనత తగ్గుతుంది. కడుపులో మంట, జీర్ణ సంబంధ సమస్యలున్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినడం మంచిది. డైటింగ్ చేసేవారు ఈ పండ్లను క్రమం తప్పకుండా తీసుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చు. ఎదుగుతున్న పిల్లలు నిత్యం తింటుంటే కాల్షియం లాంటి పోషకాలు అధికంగా లభిస్తాయి. దీంతో ఎముకలు దృఢంగా ఉంటాయి. శరీరంలో ఉన్న వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంలో ఎంతగానో ఉపయోగపడుతుంది. రక్తం శుద్ధి అవుతుంది.

**గుండె ఆరోగ్యానికి మెరుగు**

సీతాఫలం చూడడానికి కూడా హృదయాకారంలో ఉంటుంది. శరీరమంతా రక్తప్రసరణ సరిగ్గా ఉండేలా చూస్తుంది. అందువల్ల రక్తహీనత దరి చేరదు. ఈ పండు తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ లెవెల్స్ కూడా సరిగ్గా ఉంటాయి.

**ఉదర ఆరోగ్యానికి..**

దీనిలో విటమిన్ సి సమృద్ధిగా దొరుకుతుంది. ఆహారం తేలిగ్గా జీర్ణమయ్యేటందుకు దీనిలోని పీచుపదార్థం తోడ్పడుతుంది. అల్సర్లను నయం చేస్తుంది. ఎసిడిటీకీ చెక్ పెడుతుంది. డయేరియా లాంటి సమస్య రాకుండా అడ్డుకుంటుంది.

**చర్మ ఆరోగ్యానికి దోహదం**

ఈ పండులో స్మూత్ స్కిన్ టోన్ అందించే సూక్ష్మపోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడి స్కిన్ మెరుస్తుంది.

**ఆకులతోనూ ప్రయోజనం**

ఒక్క పండేకాదు, సీతాఫలంచెట్టు ఆకులు కూడా ఉపయోగపడతాయి. ఆకుల్లోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం చర్మ సంబంధ సమస్యల్ని తగ్గిస్తుంది. ఆకుల్ని మెత్తగా నూరి రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. ఆకుల్ని మెత్తగా నూరి బోరిక్ పొడర్ కలిపి మంచం, కుర్చీల మూలల్లో ఉంచితే నల్లుల బెడద ఉండదు. చెట్టు బెరడును కాచగా వచ్చిన కషాయాన్ని అధిక విరేచనాలతో బాధపడేవారికి ఔషధంగా ఇస్తుంటారు. సీతాఫలం గింజల్ని పొడిచేసి తలకు రాసుకుంటే పేల సమస్య ఉండదు. అయితే కళ్లల్లో పడకుండా చూసుకోవాలి.

**నేరుగా తినడమే మంచిది**



గర్భిణులు ఈ పండును సాధ్యమైనంత తక్కువగా తినాలి. పొరపాటున గింజలు లోపలికి వెళితే గర్భస్రావం అయ్యే ప్రమాదం ఉంది. మోతాదుకు మించి తినకూడదు. మధుమేహ వ్యాధి గ్రస్తులు, ఊబకాయులు ఈ పండ్లను వైద్యుల సలహాలతో తీసుకోవాలి. జలుబు, దగ్గు, ఆయాసం, ఎలర్జీ సమస్యలతో బాధపడేవారు పరిమితంగా తీసుకోవడం మంచిది. ఈ ఫలాన్ని రసం రూపంలో కాకుండా నేరుగా తినడమే ఉత్తమం. ఎందుకంటే గుజ్జు నోటిలోపల జీర్ణరసాలను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పండుగుజ్జును తీసుకుని రసంలా చేసి పాలు కలిపి పిల్లలకు తాగిస్తే సత్వర శక్తి లభిస్తుంది.

– వై.ఉమాజ్యోతి, శాస్త్రవేత్త, కేవీకే, రస్తాకుంటుబాయి

# గడువు పొడిగింపు

పార్వతీపురం: జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి సెషన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువును పొడిగించినట్లు డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎన్‌వీఎస్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపిఎస్://నవోదయ.జీఓవి.ఇన్ లేదా హెచ్‌టీటీపిఎస్://సిబిఎస్ఇఐటిఎంఎస్. ఆర్‌సిఐఎల్ఎల్.జీఓవి.ఇన్/ఎన్‌విఎస్/.లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

**రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..**

గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులకు గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు నమూనాను సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొందవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ సర్వీసు 15 సంవత్సరాలు కలిగి, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది, ఎటువంటి క్రమశిక్షణ చర్యలు లేని వారు అవార్డులకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి వారి ద్వారా ఆగస్టు 24 తేదీ లోగా దరఖాస్తులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

### 30లోగా నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

పార్వతీపురం: ఎలాంటి అపరాధ రుసుం లేకుండా నాల్గవ సెమిస్టర్ డీఈఎల్ఈడీ (2021-23) బ్యాచ్‌కు చెందిన రెగ్యులర్ విద్యార్థులు ఈనెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.నాలుగు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 7వరకు చెల్లించవచ్చని, సెప్టెంబర్ 19నుంచి 22వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు.

### క్రీడా పురస్కారాలకు 5 పాఠశాలల ఎంపిక

పార్వతీపురంటౌన్: క్రీడా ప్రతిభా పురస్కారాలకు జిల్లా నుంచి ఐదు పాఠశాలలు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. 2022–23 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆధారంగా సాలూరు మండలంలోని పురోహితునివలస ఏపీఎంఎస్ పాఠశాల, గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాల, పార్వతీపురం మండలం నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, పాచిపెంట మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల, కురుపాం మండలంలోని కొత్తగూడ జీటీడబ్ల్యూఏహెచ్ఎస్ ఎంపికయ్యాయని వివరించారు.

# నేలబావిలో పడి మహిళ మృతి

• మరో మహిళ పరిస్థితి విషమం


మృతి చెందిన ఈశ్వరమ్మ


చికిత్స పొందుతున్న లక్ష్మి

బొండపల్లి(మెంటాడ): మండలంలోని కుంటినవలస గ్రామంలో మామిడి మొక్కలకు నీరు పోసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నేలబావిలో కాలుజారి పడి ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో మహిళ అదే బావిలో పడి ప్రాణాలతో బయటపడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాసరపు ఈశ్వరమ్మ(42)తో పాటు నక్క లక్ష్మి(40) మామిడి మొక్కలకు నీరు పోసేందుకుగాను పనికి వెళ్లారు. ఈ నేపథ్యంలో పొలంలో గల నేలబావి వద్ద బావికి అడ్డంగా వేసిన తాటి చెక్కపై నుంచి నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నేలబావిలో పడిపోయారు. బావిలో పడిపోయిన ఈశ్వరమ్మ బురదలో కూరుకుపోయి మృతి చెందగా, లక్ష్మి బావిలో ఉన్న మొక్కను పట్టుకుని వేలాడుతూ ప్రాణాలతో బయటపడింది. బావిలో పడిన లక్ష్మి కేకలు వేయడంతో మొక్కలు నాటుతున్న అదే గ్రామానికి చెందిన వారు అక్కడికి చేరుకుని మొక్కను పట్టుకుని వేలాడుతున్న ఆమెను రక్షించి గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం సీహెచ్‌సీ తరలించగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.


బాధిత కుంటుంబసభ్యులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్ కనకదుర్గ

**ఆర్టీసీ ఢీకొని తాత్కాలిక ఉద్యోగి..**

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ హైర్ బస్సు సోమవారం ఢీకొనడంతో తాత్కాలిక ఉద్యోగి పండిత రాము మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా మృతుడి కుటుంబసభ్యులు చేసుకుని యాజమాన్యం నుంచి రావాల్సిన నష్టపరిహారాన్ని అందించాలని కాంప్లెక్స్ ఆవరణలో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో డిపో మేనేజర్ కనకదుర్గ స్పందించి బస్సు యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకువెళ్లారు.

**గుర్తు తెలియని వ్యక్తి..**


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగ బ్రిడ్జి వద్ద రైల్వేట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ పక్కన మొక్కలను తొలగిస్తుండగా గుండె నొప్పి వచ్చి చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. తెలిసిన వారు ఎవరైనా ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబఖండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలసలో ఆలయ పూజారి కిన్నెర కాంతం అన్నారావు ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు.

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి, మందరాడ, పోతులజగ్గుపేట గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదంపతులు, మహిళలు పాల్గొని, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు.

# పైడితల్లికి పుష్ప సోయగం


ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం వివిధ రకాల పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలాపాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

# అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు

• డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: పనితీరు బాగాలేని, విధుల పట్ల అలసత్వం వహించే వైద్యసిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం పీహెచ్‌సీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. నిర్దేశించిన సమయంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం వద్ద వైద్యులు అందుబాటులో ఉండాలని చెప్పారు. అలా కాకుండా విధులకు డుమ్మాకొడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరానికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, సుగర్, ఆస్తమా వంటి కలిగిన బాధితులను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, జిల్లా మలేరియా అధికారి వై.మణి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఉన్నత చదువుకు ప్రభుత్వం భరోసా


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పక్కన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పేదల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తూ విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి రామభద్రపురం, బాడంగి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ మెంటాడ మండలం కుంటినవలస వద్ద ఈ నెల 25వ తేదీన జరగనున్న కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రానున్నందున పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంత పేద విద్యార్థులతో పాటు పొరుగు రాష్ట్రాల విద్యార్థులకు గిరిజన విశ్వవిద్యాలయం అందుబాటులోకి రానుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఏది చేసినా టీడీపీ నాయకులు సహించలేకపోతున్నారని విమర్శించారు. రాను రాను గల్లంతవుతున్న పార్టీ ఉనికిని నిలబెట్టేందుకు ప్రభుత్వంపైన లేనిపోని బురదజల్లుతున్నారని మండిపడ్డారు. ఈ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు అడిగిన వెంటనే మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రికి ఉత్తరాంధ్ర ప్రజలమంతా రుణపడి ఉంటామన్నారు.

**సభకు తరలిరావాలి**

ముఖ్యమంత్రి సమావేశానికి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పిస్తున్నామని అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, రామభద్రపురం బాడంగి జెడ్పీటీసీలు అప్పికొండ సరస్వతి, పెద్దింటి రామారావు.బొబ్బిలి వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, రామభద్రపురం, బాడంగి నాయకులు పాల్గొన్నారు.

# అమ్మవారి అన్నదానానికి టేబుల్స్ వితరణ


టేబుల్స్ వితరణ చేస్తున్న డాక్టర్ వీఎస్.ప్రసాద్

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదానానికి సంబంధించి భక్తుల సౌకర్యార్థం కూర్చునేందుకు ఆరు టేబుల్స్, ఆహార పదార్థాలు పెట్టుకునేందుకు రెండు పెద్ద టేబుల్స్ మొత్తం రూ.లక్షా 50 విలువైన వాటిని వైద్యనిపుణుడు డాక్టర్ వీఎస్.ప్రసాద్ మంగళవారం అందజేశారు. ఈ మేరకు స్థానిక అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రస్టు బోర్డు సభ్యుల సమక్షంలో టేబుల్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రమేష్ పట్నాయక్, ఏడుకొండలు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, బలివాడ పార్వతి, గంధం లావణ్య, రామ్‌సింగ్ సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కళలను పరిరక్షించాలి : కోలగట్ల


డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం: ఉత్తరాంధ్రకే వన్నె తెచ్చిన ఎన్నో కళలు నేడు మరుగున పడుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ప్రపంచ జానపద కళల దినోత్సవం సందర్భంగా విజయనగరం రాగ సుధా రంగస్థల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుర్రకథల పోటీలు నిర్వహించారు. విజయనగరం బుక్క వీధిలో గల ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం జరిగిన పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు బుర్రకథ బృందాలు పాల్గొని ప్రదర్శనలిచ్చాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపసభాపతి కళాబృందాల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి, నిర్వాహకులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. జానపద కళ అనేది ఎంతో శ్రమ, పట్టుదల ఉంటే గానీ చేయలేమని, అలా చేసే వారిని ప్రోత్సహించేలా చూడాలని అన్నారు. ప్రాచీన జానపద కళారూపంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకప్పుడు విశేష ప్రజాదరణ పొందిన బుర్రకథ... టీవీ మాధ్యమం ప్రజల్లోకి వచ్చాక కొంత ఆదరణ కోల్పోయిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల తర్వాత కొన్ని కళారూపాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదానికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళలను బతికించేందుకు, కళాకారులను ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.